క్లుప్తంగా

పరీక్షలంటే భయం వద్దు



అవగాహన కల్పిస్తున్న జయకృష్ణారెడ్డి

దండేపల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే ఏమాత్రం ఆందోళన చెందొద్దని, భయపడొద్దని వ్యక్తిత్వవికాస నిపుణులు జయకృష్ణారెడ్డి సూచించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నందున విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హెచ్ఎంను విధుల నుంచి తొలగించాలి'

మంచిర్యాలఅర్బన్: సాయికుంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థినులతో పాటు మహిళపై అసభ్యంగా వ్యవహరిస్తున్న ఆయనపై విచారణ చేపట్టి, విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టీవీజేఎస్, బీసీవీస్, టీవీఎస్ సంఘాల నాయకులు ప్రవీణ్, సల్మాన్, క్రాంతి ప్రకటనలో కోరారు.

కార్మికుని మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఉదయ్ కిరణ్, తదితరులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న ముంజం రాజయ్య గురువారం మృతి చెందగా, అతని స్వగ్రామం భీమారం మండలం పోలంపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్, జవాన్లు మేకల నగేశ్, కుంటల రాజలింగు, కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, మాడుగుల నవీన్‌లు మృతునికి సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. దహన సంస్కారాలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.10వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందించారు.

రెడ్ నోటీసులకు స్పందన



పన్ను చెల్లిస్తున్న దుకాణదారుడు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఏళ్ల తరబడి పన్ను బకాయిలు ఉన్న వారికి అధికారులు అందిస్తున్న రెడ్ నోటీసులకు స్పందన వస్తోంది. ఇటీవల 10మందికి రెడ్ నోటీసులు ఇవ్వగా, అందులో ఏడుగురు రూ.3లక్షల వరకు పన్ను బకాయిలు చెల్లించినట్లు మేనేజర్, వారంట్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో గల పిండిగిర్నీకి సంబంధించిన షాపు పన్ను రూ.46,104 ఉండగా, రెడ్ నోటీసును జారీ చేసినా స్పందించకపోవడంతో గురువారం ఆ షాపును సీజ్ చేశారు. కార్యక్రమంలో నస్పూర్ మేనేజర్ కరుణాకర్, ఆర్ఐలు శంకర్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన విశ్వశాంతి మహాయాగం



పూజల్లో పాల్గొన్న భక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా మైదానంలో శ్రీ కృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో చేపట్టిన విశ్వశాంతి మహాయాగ మహోత్సవం గురువారంతో ముగిసింది. ఫిబ్రవరి 2న యాగశాలలో ప్రారంభమైన విశ్వశాంతి మహాయాగం గురువారం వరకు నిర్విరామంగా కొనసాగింది. యాగం జరిగినన్ని రోజులు పట్టణం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు హోమాల్లో పాల్గొన్నారు. చివరి రోజు మహాపూర్ణహుతి, గురు పూజ, శ్రీ కృష్ణ ఉట్టికొట్టుట, తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఆఖరి మజిలీకి అవస్థలు



మందమర్రిలో అసంపూర్తిగా వైకుంఠధామం

- నిధులు మంజూరైనా పూర్తికాని వైకుంఠధామాలు
- వాగులు, అటవీ ప్రాంతాల్లోనే అంత్యక్రియలు
- మున్సిపాలిటీల్లో ప్రజలకు తప్పని కష్టాలు
- 'మంచిర్యాల' తరహాలో నిర్మించాలని డిమాండ్

జిల్లాలోని మున్సిపాలిటీల్లో వైకుంఠధామాల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ముందుకుసాగడం లేదు. ప్రజలు సొంతవారి అంత్యక్రియలు నిర్వహించేందుకు అవస్థలు పడుతున్నారు. నదులు, వాగులతోపాటు అటవీ ప్రాంతాల్లో దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో స్నానాలు ఆచరించేందుకు నీళ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మంచిర్యాల తరహాలో ఆధునిక వైకుంఠధామాలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో వైకుంఠధామాల నిర్మాణంపై 'సాక్షి' ఫోకస్..

- చెన్నూర్

చెన్నూర్‌లో భూమిపూజకే పరిమితం



కొనుగోలు చేసిన శ్మశానవాటిక స్థలం

చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి నది ఒడ్డున వైకుంఠధామం నిర్మాణానికి 2023లో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. శ్మశానవాటిక నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రూ.16లక్షలకు గోదావరి ఒడ్డున ఎకరం భూమి కొనుగోలు చేసి, అప్పటి ప్రభుత్వ విప్ బాల్కసుమన్ భూమిపూజ చేశారు. నేటికీ ఆ భూమిలో పనులు మొదలుకాలేదు. నిధులు కూడా మళ్లిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

లక్సెట్టిపేటలో ప్రభుత్వ భూమి కరువు

లక్సెట్టిపేటలో ట్రస్ట్ ద్వారా నిర్మించిన వైకుంఠధామం ప్రజలకు ఉపయోగపడుతుంది. రెండేళ్ల క్రితం రూ.కోటి నిధులు మంజూరైనప్పటికీ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. నిధులు మళ్లిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తిరిగి నిధులు మంజూరు చేసి, అన్ని సౌకర్యాలతో వైకుంఠదామం నిర్మిస్తే మేలు జరుగుతుందని ప్రజలు అంటున్నారు.



లక్సెట్టిపేటలో ట్రస్ట్ ద్వారా నిర్మించిన వైకుంఠధామం

నస్పూర్‌లో నత్తనడకన పనులు

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లపల్లి గోదావరి ఒడ్డున టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఒక్కొక్కటి రూ.కోటి నిధులతో రెండు శ్మశాన వాటికల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండేళ్లు కావస్తున్నా, పనులు పూర్తి కాలేదు. అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

బెల్లంపల్లిలో అసౌకర్యాల మధ్య అంత్యక్రియలు

బెల్లంపల్లిలోని పోచమ్మగడ్డ, రడగంబాల బస్తీలలో రూ.కోటితో రెండు వైకుంఠధామాలు ఏర్పాటు చేశారు. పోచమ్మగడ్డ వైకుంఠధామంలో ప్రహరీ, బోరు పంపు, బాత్‌రూమ్, డ్రెస్సింగ్ రూమ్‌లు నిర్మించారు. రూ.10లక్షల నిధులతో పార్థివదేహం బర్నింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. మొత్తం రూ.50లక్షలు ఖర్చు చేశారు. సాంకేతిక కారణాలతో బర్నింగ్ మిషన్ పనిచేయడం లేదు. రగడంబాల బస్తీలో రూ.50లక్షలతో వైకుంఠధామం ఏర్పాటు చేశారు. కేవలం ప్రహరీతో పాటు కొన్ని పనులు చేపట్టి వదిలిపెట్టారు. ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. రెండు వైకుంఠధామాల్లో అంతర్గత రోడ్లు, అరకొర వసతుల మధ్య బాత్‌రూమ్‌లు నిర్మించారు. బోరు ఉన్నప్పటికీ నీరు రాదు. ప్రజలు ట్యాంకర్‌తో నీటిని తీసుకొచ్చి స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మంచిర్యాలలో 102 రోజుల్లో పూర్తి



మంచిర్యాల కార్పొరేషన్‌లో రాష్ట్రంలోనే ఆధునిక సౌకర్యాలతో పాటు సోలార్ వైకుంఠధామాన్ని ఏర్పాటు చేశారు. వైకుంఠధామ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4కోట్లు, ఎస్‌డీఎఫ్ నుంచి రూ.42లక్షల నిధులను కేటాయించారు. 102రోజుల్లో మహాప్రస్థానం (వైకుంఠధామం) నిర్మించి రికార్డు సృష్టించారు. మరో విశేషం ఏమిటంటే అద్దె ఇళ్లలో నివసించే వారితో పాటు ఇళ్ల వద్ద ఎలాంటి సౌకర్యాలు లేని వారు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

క్యాతనపల్లిలో తప్పని తిప్పలు

క్యాతనపల్లి మున్సిపాలిటీలో 45వేల జనాభా ఉన్నప్పటికీ శ్మశానవాటిక లేదు. అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు లేవు. ఎక్కువ శాతం భూములు సింగరేణి పరిధిలో ఉండటంతో సింగరేణి సంస్థ స్థలాన్ని కేటాయించడం లేదు. కొన్ని మతాల వారు రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాల బయట ఉన్న పారెస్ట్‌భూమిలో, మరి కొంతమంది సింగరేణి ఓసీ సమీపంలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

మందమర్రిలో 80శాతం పూర్తి

మందమర్రి బల్దియాలో 2023లో వైకుంఠధామం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిధుల మంజూరు జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం కేకే–5 సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో ప్రజలు చివరి మజిలీ తంతును పూర్తి చేస్తున్నారు.

ఈత చెట్ల తొలగింపునకు అనుమతులు జారీ

నస్పూర్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామంలో త్వరలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్‌ప్లాంటు స్థలంలో ఈత చెట్ల తొలగింపునకు సంబంధిత శాఖల అన్ని అనుమతులు జారీ చేసినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. నస్పూర్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆసిష్‌సింగ్‌తో కలిసి అబ్కారి, మద్యనిషేధ, ఉద్యానవన, సింగరేణి, రెవెన్యూ శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బుధాకలాన్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న పవర్‌ప్లాంట్‌కు సింగరేణి స్థలంలో 464 ఈత చెట్ల తొలగింపు కోసం సంబంధిత శాఖల నుంచి అనుమతులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలగించి చెట్లకు బదులుగా సింగరేణి భూముల్లో రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటాలనే నింబంధనతో అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. తొలగించిన ఈత చెట్లకు సంబంధించిన నష్టపరిహారంలో 50శాతం భూమి యజమాని అయిన సింగరేణి సంస్థకు, 25శాతం గీత కార్మికుల సొసైటీకి, మిగిలిన 25శాతాన్ని ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. ఒకవేళ సొసైటీ మనుగడలో లేనట్లెతై అబ్కారి, మద్యనిషేధ శాఖకు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అబ్కారీ, మద్యనిషేధ శాఖ పర్యవేక్షకులు నందగోపాల్, జిల్లా ఉద్యానవన అధికారి అనిత, డివిజన్ పర్యవేక్షకులు అరవింద్, సింగరేణి సంస్థ ఎస్టేట్ అధికారి నవనీత, ఫారెస్ట్రీ మేనేజర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎస్ఈ నరేష్, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఎండి ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని టూటౌన్ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన నాయకులు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టూటౌన్ ప్రాంతంలో కూరగాయల మార్కెట్ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, రోడ్లపైనే చిరు వ్యాపారస్తులు అమ్మకాలు కొనసాగిస్తున్నప్పుడు ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయన్నారు. దీంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రతి చిన్న అవసరానికి తాము వన్‌టౌన్‌కు రావాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. శాశ్వత పరిష్కారంగా కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని, దీని ద్వారా మరికొంత మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీపతి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, బొట్ల సత్యం, నాయకులు తాజొద్దీన్, కర్రు శంకర్, పడాల రవి, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న టూటౌన్ ప్రజలు

స్థానిక సంస్థల్లో సత్తా చాటుతాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్
- జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణుల సంబురాలు



చెన్నూర్: సంబురాల్లో బీజేపీ శ్రేణులు



భీమారంలో...

చెన్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంపై కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, గాంధీచౌక్‌లలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో తెలంగాణ ప్రజల చూపు ఇప్పుడు బీజేపీ వైపు ఉందని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి అన్నారు. హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోటపలుకుల తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

భీమారం/మంచిర్యాలక్రైం/రామకృష్ణాపూర్/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/దండేపల్లి: ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో, రామకృష్ణాపూర్, భీమారం, మందమర్రి, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల్లో టపాసులు పేల్చి, మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. తెలంగాణలో రాబోయే ప్రభుత్వ బీజేపీయేనని ఆశాభావం వ్యక్తం చేశారు. లక్సెట్టిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో న్యాయవాది పరిషత్ ప్రధాన కార్యదర్శి తులా ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరపు జగన్, దేగ రవి, కిషన్, నరేందర్, శేఖర్, సాగర్, సంతోష్ గౌడ్, రామకృష్ణాపూర్‌లో పార్టీ రాష్ట్ర నాయకులు ఆరుముళ్ల పోషం, ధన్‌సింగ్, వేముల అశోక్, ఈశ్వరాచారీ, భీమారంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మాడెం శ్రీనివాస్, జిల్లా నాయకులు కొశెట్టి నాగేశ్వర్‌రావు, దుర్గం అశోక్, మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, ఆవిడపు సురేశ్, మందమర్రిలో సంజీవరావు, బీజేపీ మండల అధ్యక్షుడు జనార్దన్, మల్లేష్, రవికుమార్, రాజయ్య, రంజిత్, శేఖర్, దేవేందర్, ఆయా మండలాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రామకృష్ణాపూర్: కేర్ ఇన్సూరెన్స్, మెడిలైఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీజోన్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలు, ఆరోగ్య సమస్యల దృష్ట్యా అయ్యే వైద్య ఖర్చులకు ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ తప్పక హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. హెల్త్ కేర్ ప్లానర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏరియా హెడ్ సురేష్‌బాబు, టెరిటరీ మేనేజర్ విజయ్‌కుమార్, బ్రాంచి మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

'పత్తి రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం'

చెన్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పత్తి రైతులు కన్నీరు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో గురువారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికారుల అండదండలతో దళారులు రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రోడ్డెక్కినా స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పత్తి రైతులకు జరుగుతున్న అన్యాయంపై సీపీఐ అండగా ఉంటుందన్నారు.

ఉత్సాహంగా మహిళల ఆటల పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. జీఎం కార్యాలయం ముందు ఉన్న సెంట్రల్ నర్సరీలో ఈ పోటీలు జరిగాయి. బాంబ్ బ్లాస్ట్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు రేపు జరిగే వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి, ఇన్‌చార్జి ఎస్ఓటుజీఎం శ్రీధర్‌రావు, గుర్తింపు సంఘం బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ పీఓ రణదీప్‌గౌడ్, ఇండోర్‌కెప్టెన్ తోట సురేశ్ పాల్గొన్నారు.



త్రోబాల్ ఆడుతున్న మహిళలు

వేసవి ఉపశమన చర్యలు తీసుకోవాలి

శ్రీరాంపూర్: ఎండలు ముదిరిన దృష్ట్యా ఓసీపీల్లో ఉపశమన చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షులు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. ఓసీపీల్లో కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. చలువ పందిళ్లు వేయాలన్నారు. సెక్యూరిటీ గార్డు పోస్టుల దగ్గర కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. దుమ్ము, దూళీ లేవకుండా వాటర్ స్ప్రే చేయాలన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సీహెచ్‌పీ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో సింగరేణి కాలరీస్ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన ఫిట్ కమిటీని గురువారం అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శులు బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య ఎన్నుకున్నారు. కమిటీ చీఫ్ అడ్వైజర్లుగా ఈ.సదయ్య, సాయిరాజ్, బీ.రమేష్, ఫిట్ సెక్రెటరీగా ఏ.రాజ్ కుమార్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా కే.లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీగా కళ్యాణ్, కోశాధికారిగా శ్రీనివాస్, షిఫ్టు ఇన్‌చార్జులుగా రవీందర్, ఏ.సంపత్, ఆర్.శ్రీనివాస్, నరేందర్, ఎగ్జిక్యూటివ్స్ సభ్యులుగా త్రివేణి షణ్ముఖ చారి, కోటి, జే.నారాయణరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ బీసీ ఉద్యోగుల హక్కులు, ఐక్యత కోసం కృషి చేయాలని నాయకులు సూచించారు.

బెల్లంపల్లి వాసికి డాక్టరేట్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన సింగతి ఉపేందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ వరించింది. ఉపేందర్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆంగ్ల విభాగ ప్రొఫెసర్ కె.ఎం ప్రవీణ ఆధ్వర్యంలో 'ఎర్లీ ఇండియన్ డ్రామా ఇన్ ఇంగ్లిష్- ఏ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ ప్లేస్ ఆఫ్ ప్రీ ఇండిపెండెన్స్ ఎరా' అనే అంశంపై పరిశోధన థియరీస్ రాసి సమర్పించాడు. ఈ అంశం పై ఉపేందర్ చేసిన పరిశోధనకు యూనివర్సిటీ ఈ నెల 1న డాక్టరేట్‌ను ప్రకటించింది. స్వాతంత్య్రానికి ముందు భారతీయ నాటకాల మీద ఆంగ్లంలో పరిశోధన చేయడం, డాక్టరేట్ వరించడంపై ఉపేందర్ కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మ్యాజిక్ షో

జన్నారం: మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో మూఢ నమ్మకాలపై ప్రముఖ మెజీషియన్ మహ్మద్ ఇస్మాయిల్ మ్యాజిక్ షో చేశారు. మాయలు, మంత్రాలు లేవని, మోసం చేయడానికి వచ్చే వారిని నమ్మొద్దని విద్యార్థులకు మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు.